# నన్ను నడిపించిన చరిత్ర

## వకుళాభరణం రామకృష్ణ

ఎమెస్కో

# జ్ఞాపకాలు ఎందుకు రాశాను

ఒక్కమాటలో చెప్పాలంటే లలిత కిచ్చిన మాటకోసం. లలిత 'నా జ్ఞాపకాలు' పేరుతో తన జీవిత విశేషాలు రాసింది. ''మీరు రాయాలండి, మీ జ్ఞాపకాలు విస్తృతమైనవి, విభిన్నమైనవి'' అని అంటుండేది. నా పై తనకున్న ప్రేమాభిమానాలు మాత్రమే కాదు అలా అనడానికి. నా అనుభవాలు అనేకానేక విషయాలను ప్రస్తావిస్తాయనీ, అవి ఆయా సందర్భాల్లో జరిగిన విశేషాలను తెలియచేస్తాయని కూడా కావచ్చు.

జీవితంలో నేను సంపాదించుకొన్న వెలకట్టలేని సంపద అనేకులైన నా మిత్రులు, శ్రేయోభిలాషులు, పరిచయస్థులూను. వీరి పరిచయంతోపాటు వారిచ్చిన ప్రోద్బలం నాకు ఊతమిచ్చి నన్ను నడిపించింది. నన్ను నేను సమర్థించుకోవడానికి, ఇది చెపుతున్నానని అనుకొన్నా, ప్రతి వ్యక్తికీ తన్ను గూర్చి చెప్పుకోవాలన్న ఆసక్తి వుండడం సహజం. ఇది బలహీనతా? కాదనను. మినహాయింపులుండవచ్చు.

వ్యక్తిగత జీవిత చరిత్రల పొరల్లో దాగి, పరిసరాల, ప్రాంతీయ, దేశ చరిత్రల ఆనవాళ్లు వుండవా? స్వీయజీవితచరిత్రకారుడు వీటిని తన 'కథ'లో స్పృశించడా?

జీవిత చరిత్రలు, ఆయా వ్యక్తుల, వారి, వారి జీవితాలను వాస్తవంగా, అరమరికలు, దాపరికాలు లేకుండా ప్రతిబింబిస్తాయా? అందరూ 'మహాత్ములు' కారు, కాలేరు. అలాంటప్పుడు అవి నికార్సయిన రచనలు అవుతాయా? ప్రతి జీవితచరిత్రకారుడు నిజాయితీగా ఎదుర్కొనే ప్రశ్నలు యివి!

నేను రాయడానికి పూనుకొనే ముందు నాలో కలిగిన ఆలోచనలు ఇవి. అయినా రాయడాన్కి పూనుకొన్నాను. గత జీవితపు నెమరువేత! నాతో నేను మాట్లాడుకొనే స్వీయ సంభాషణ నా తృప్తికోసం, మహా అయితే మా కుటుంబం, మిత్రులకోసం, శ్రేయోభిలాషులకోసం, భావి తరాల కోసం.

ఈ ప్రక్రియలో తోడ్పడి, ప్రోత్సహించి, దోహదం చేసిన వారెందరో! ముఖ్యంగా చెప్పుకోవలసిన వారిలో ప్రేమ, స్వామీజీ (ప్రొ. లక్ష్మీ నారాయణ), బి.వి. రాఘవులు, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, ఎ.వి. కోటిరెడ్డి, రాఘవశర్మ, లక్ష్మయ్యగార్లు.

రాతప్రతిని ఒకటికి రెండుసార్లు ఓపికగా చదివి మార్పులు, చేర్పులు సూచించిన మోదుగుల రవికృష్ణ గారు.

రచన ఆసాంతం చదివి తుదిమెరుగులు దిద్దిన ఎమెస్కో సంపాదకులు డా. డి. చంద్రశేఖర రెడ్డిగారు.

రాతప్రతిని ఎన్నిసార్లు మార్చినా, విసుగుపడకుండా, చక్కగా టైపు చేసిన సౌజన్య, స్వామి గార్లు.

ఆత్మకథ రాయమని తొందర పెట్టి ప్రచురణ బాధ్యత చేపట్టిన ఎమెస్కో విజయకుమార్ గారు.

వీరందరి రుణం తీర్చుకోలేనిది, అందరికీ నమోవాకాలు. మా పిల్లలకు ఆశీస్సులు. చిరంజీవి వంశీ ఆసాంతం చదివి చక్కని సూచనలు చేశాడు.

**– వకుళాభరణం రామకృష్ణ**

# 1

ఇప్పుడు నాకు 84 ఏళ్లు. ఎనిమిదిపదులు దాటింది. ఇది వయసు మీరడమే! వయసుతో పాటు వచ్చే బలహీనతలు, మానసిక రుగ్మతలు, ఓపిక తగ్గడం, ఏకాగ్రత లోపించడం ఇవి మామూలే. వీటిని ఎవరూ ఆపలేరు. ఆరోగ్యం పరవాలేదు. బ్లడ్ ప్రెషర్, డయాబెటిస్ ఉన్నా, పరిధిలోనే ఉన్నాయి, మందుల సాయంతో. అయితే స్థిరత్వం లోపించింది. నా మనఃసాక్షి లలిత వెళ్లిపోయింది. అనుకోలేదు. కాలం గడుస్తోంది. అనూహ్యపరిణామం. అంతా మూడువారాలలో ముగిసింది. నిర్లక్ష్యం చేయలేదు. అయినా సకాలంలో కనీసం ఒక వారం ముందు రక్తంలో వస్తున్న మార్పు 'సెల్యూలాటిస్'గా మారి గడ్డకట్టిందట. ఇది తెలియకపోవడం కేవలం నా అజ్ఞానం. ఆమె భరించలేనంతగా నొప్పి ఉందంటే ఒక పెయిన్ కిల్లర్ అదనంగా వేసుకోమని చెప్పాను. కానీ అది క్రిమిదోషమని తెలుసుకోలేకపోయాను. తీరా తీసుకెళ్లి ఐసీయూలో ఉంచితే ఇరవై రెండురోజులు పోరాడినా నయం కాలేదు. ఒకవేళ కొద్దిగా నయమై ఇంటికొచ్చినా తన మనుగడ నరకప్రాయమయ్యేది. ఇది బాధతో కూడిన సమాధానం చెప్పుకొనే ఊరట. కానీ, అలా ఎలా వెళ్లిపోయింది! తన జీవితరేఖ నాకంటే రెండింతలు అని చెబుతూ, అరచేయి చూపిస్తుంటే నమ్మకం లేక తల ఊపేవాణ్ణి. ఏమి జీవితం! సంఘటనాత్మక జీవితం. ఇంట్లో అడుగుపెట్టిన నాటి నుంచి ఆఖరుదాకా ఎదుగుతూ వచ్చింది. అకడమిక్‌గా, మేధాపరంగా–స్వయంకృషి–ఎం.ఏ., తరువాత బి.ఎడ్., సెకండ్ ఎం.ఏ., పిహెచ్.డీ., అప్పటి ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాల్లో క్షేత్రపరిశోధన, దాదాపు పదిహేనుకుపైగా ముద్రిత గ్రంథాలు–ఎలా? నేను ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉంటే, తాను వంశీ చదువుకోసం కావలిలో. నేను జె.ఎన్.యూ. లో అయిదు సంవత్సరాలు ఉంటే, తాను వంటరిగా పిల్లలతో – కొత్త ఇల్లు కట్టుకోవడం, ఉద్యోగం, పరిశోధన– అపురూపమైన అబ్బురపరిచే వ్యక్తిత్వం. అందరిచేత ఎంత మెప్పులు, అభినందనలో! నమ్మశక్యం కావడం లేదు. సంప్రదాయాలు మరువలేదు. ఆధునికతను నిరసించకపోవడమే కాదు, సొంతం చేసుకుంది. ఇటు మా కుటుంబాలలో, బైటా ఆదర్శంగా ఉండి అందరి ప్రశంసలను